# ప్రేమసందేశం

ఐ. విజయమోహన్ రావు

"మనసులేని దేవుడు మనిషికెందుకో మనసిచ్చాడు" మరి ఈనాడు నా మనసు నీ చుట్టూ తిరుగుతోన్నప్పుడు ఆ మనసును నీ మనసు గ్రహించలేనప్పుడు, గమనించే స్థితిలో లేనప్పుడు, నా మనసు నా మనసులో లేక నా మాట వినక ఎక్కడికో, మరెక్కడికో వెళ్ళిపోయి మళ్ళీ తిరిగిరాక నన్ను కవ్వించి, నాలో కలవరింతలు రేపిన నీ గురించే ధ్యానిస్తూ, తపిస్తూ, రాగాలాపనచేస్తూ— అలా... అలా ఉండిపోతే, మరి నేనేం కావాలి. అందుకే 'మనసులేని దేవుడు...' అంటూ పాడుకుంటూ ఉండిపోతున్నాను. అది విషాద గీతమో, విరహ గీతమో, వరూధినికై ప్రవరాఖ్యుడు... ఛీఛీ తిరగబడింది. ప్రవరాఖ్యుని కోసమై వరూధిని పాడుకునే పాడటయో, దేవుడు మనిషితో, అతని మనసుతో ఆడుకుంటూ ఉన్నప్పుడు ఓ పిచ్చి మనసు ఆలపించే వేదనాగీతమో నాకు తెలియదు. కానీ నాకు తెలిసింది ఒక్కటే. అది 'నువ్వు'. నా ప్రాణం నువ్వే, నా జగతి నువ్వే, నా రాగం, గీతం, భావం, భాష్యం అన్నీ నీవే అయి నా ముందు ప్రణయ గీతికలా నృత్యస్తుంటే నన్ను నేను ఆపుకో లేకపోతున్నాను.

అలా చూస్తావు— ఇలా నవ్వుతావు, దానర్థం ఏమిటి చెప్పమ్మా— నన్ను చంపక. ఓ చంపకా— అది నీ పేరని తెలిసింతర్వాత నేను తెగ నవ్వుకున్నాను. ఎందుకో తెలుసా! నువ్వు మాటిమాటికీ ఉపయోగించే పదమే కదా అది. మది యాదృచ్ఛికమో! ఏమో కానీ మీ పెద్దాళ్ళు కూడా నీ పేరు 'చంపక' అని పెట్టారు. నేననుకుంటూ ఉంటాను. పేరు పెట్టే ముందు నీ వాళ్ళందరూ తెగ ఆలోచిస్తూ వుంటారు. నీకు ఆకలయి ఉంటుంది. వీళ్ళేమో నీకేం పేరుపెడతామా అన్న ఆలోచన ఓ కొలిక్కిరాక ఆలశ్యం చేస్తుంటే అప్పుడు నువ్వని వుంటావు 'అబ్బ ఏదో ఒకటి పెట్టండర్రా నన్ను 'చంపక!' అని. ఇది నా ఊహ మాత్రమే సుమా! ఏంటీ ఇతగాడు ఇంతలా ఊహించేశాడు అని ఆశ్చర్యపోతున్నావా!

మరి మన పని అదే, కథలూ, కవితలూ ఊహించి రాయడమే గదా! అవును గాని అదేంటమ్మా నేనడిగిందానికి సమాధానం చెప్పి కూడా అలా వెళ్ళిపోయావ్. నిజం చెప్పు. నువ్వు నన్ను ప్రేమించడం లేదూ? చెప్పమ్మా. నా గురించి నేనేం చెప్పను. నువ్వు లేకుండా మాత్రం నేను బ్రతకలేను. ఇది చాలా— ఇంకా కావాలంటే నేను బ్రతకాలంటే నువ్వు కావాలి! ఇదేంటి తిరగేసి, మరగేసి ఒకటే చెప్తాడు అనుకుంటున్నావా! అంతే మా రచయితల పనే అంతకదా! ఒకదాన్నే అందరూ చెప్తారు. కాని తిప్పి తిప్పి— అవును చంపకా. ఇది మాత్రం నిజం. ప్రేమంటే ఏంటో నాకు నిజంగా తెలీదు. కాని నువ్వు నాకు కావాలి. నువ్వు నా దానివి కావాలి. నిన్ను నా సొంతం చేసుకోవాలి అన్న ఆలోచన నిన్ను చూసినప్పటి నుండి నాలో ఇంతింతై వటుడింతై అన్నట్టు పెరుగుతోంది.

నువ్వంటే అభిమానం, ప్రాణం పోయినా సరే నిన్ను వదులుకోవద్దు అన్న ఆవేశం. నీపై ఆరాధన తరగనిదమ్మా? మాటలలో చెప్పలేనిది.

ఎలా చెప్పను. ఏం చెప్పను. నా మనసులో ఉన్న భావానికి ఓ పేరు పెడితే అది ప్రేమ అవుతుంది. నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని ఎలా చెప్పాలో ఇన్నాళ్ళు మదనపడ్డాను. ఆలోచించాను. ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చేసరికి కాలం మించిపోయింది. నా ఆశల భవనాలు కుప్పలుగా కూలిపోయాయి. నేను నిర్మించుకున్న ప్రేమమందిరం నాశనమైంది. నేను ఏర్పరుచుకున్న ప్రేమనగరం రూపు మాసిపోయింది. ఏడుస్తూ బ్రతకాలో, రోధిస్తూ జీవించాలో తెలీటం లేదు. అయినా నిన్ను విడిచి ఎలా ఉండగలను. నువ్వు లేవని తెలిసి ఎలా జీవించగలను. ఇంతవరకూ నా జీవితంలో దేన్నీ కోరుకోలేదు. ఇది కావాలి అని దేనిగురించి ఆలోచించలేదు. ఒకే ఒక్క కోరిక ఆ దేవుడ్ని కోరుకున్నాను.

అది 'చంపక'ను నాదాన్ని చెయి స్వామీ అని. కాని ఆ దేవుడు నా కోరిక కనికరించలేదు. అయినా నా పిచ్చిగాని మనసులోని ఆ దేవుడ్ని మనసు గురించి ప్రేమ గురించి, మమత గురించి అడగటమేంటి?

అంతే నా కోరిక అలా తీరనిదైపోయింది. నీ మీద మనసు పెంచుకున్నాను. అంతా నువ్వే అనుకున్నాను. కాని నువ్వు ఇక నాదానవు కావు అని తెల్సింతర్వాత ఇక జీవించాలని నేననుకోలేదు. ఈ బ్రతుకుమీద నాకు కోరిక లేదు. నా ప్రాణం మీద తీపిలేదు. 'ఎక్కడవున్నా నీ సుఖమే నే కోరుకున్నా' అని అనుకుంటూ బ్రతికే ధైర్యం నాకు లేదు. అలా అని నిన్ను మరిచిపోయే శక్తీ లేదు. అందుకే నీ పెళ్ళి రోజే నేను నన్ను నేను అంతం చేసుకుంటున్నాను. నిజంగా నువ్వు నీ పెళ్ళి శుభలేఖ ఇస్తూ విషయం చెప్పేసరికి అంతా




శూన్యం అయింది. నేను వింటున్నది నిజమో కలో తెలీలేదు. మన ప్రేమ గురించి కథలా రాసి నీకు ఇద్దామని, నీకు అసల సంగతి చెప్తామని నీదగ్గరకొస్తే నువ్వు నీ పెళ్ళి సంగతి చెప్పడం, మానసికంగా నేను అప్పుడే చనిపోయాను. నువ్వు ఇక నాకు చెందవు అన్న నిజం తెలిసేంత ర్వాత నేనెలా ఉండగలను.

నువ్వు మరొకడి సొత్తువు అని తెలిసి ఎలా మనుగడ సాగించడం. అందుకే ఇక ఈ తను వును నా నూరేళ్ళ జీవితాన్ని ఈ ఇరవై మూడేళ్ళ తో చాలించుకొంటూన్నా.

నిన్ను బాధించాలని కాదు ఇలా రాశేది. నేను నిన్ను ప్రేమించినట్లు నీకు తెలవాలి కదా! నా ప్రేమసందేశం ఎలాగైనా ఎప్పుడైనా నిను చేరా లని నీకు రాస్తున్నానిది.

మరి నువ్వు నన్ను ప్రేమించావో లేదో నాకు తెలీదు. నన్ను అభిమానించావో తెలీదు.

'ప్రియా' ఒకవేళ నన్ను నువు ప్రేమించి ఉంటే ఒక్క కన్నీటి బొట్టు విడువు. ఈ ప్రపంచంలో ఎవరూ లేని నన్ను ఒక్కరైనా ప్రేమించారని, అభిమానించారని పై నుంచి చూసిన నా ఆత్మసంతృప్తి పడుతుంది. వీలుం టే మరొాటి అంటూ ఉంటే వచ్చే జన్మలోనైనా నన్ను నిన్ను ఒకటి వేయమని ప్రార్థిస్తున్నాను.

ఆ దేవుడ్ని మాత్రం కాదు.

ప్రేమని——

సెలవు——

ఆమె కళ్ళనుండి ఓ రెండు నీటి ముక్కలు రాలి ఆ కాగితాలపై పడ్డాయి.